# గురు ప్రసాదం

ఈలా రమ్మని తల ఊపి పిలిచాడు తాతగారు.

చూసింది: పిలుస్తున్నాడని గ్రహించింది: దగ్గరకు వెళుదామా, వద్దా అనే యోచనతో ఉన్నట్లు, ఒక క్షణం, ముందుకు అడుగు వేయకుండా నిదానించింది. మళ్లా ఏమనుకున్నదో, నడక సాగించింది.

అరుగు అంచున, స్తంభానికి ఓసరిలి, జేరవేసిన పాదం చిరుగా ఆడిస్తూ, సరదాగా కూర్చునివున్న తాతగారు, అమాంతం క్రిందకు దిగి, పదచాలనపు ధూకుడుతో, రోడ్డు నడి కెక్కి, బిగ్గరగా – విసురుగా,

'ఏయ్, పిల్లా!' అని కేకేశాడు.

వయ్యారంగా తిరిగిచూసి, నిలువబడిపోయింది దూరాన, ఆ అమ్మాయి.

'నిన్నే రమ్మంటున్నది' అని పతాక వెలికలవేసి నిర్దేశిస్తూ, మళ్ళమని, ఆ చెయ్యే విసిరాడు.

వస్తూన్నది: తాతగారు సగం దూరం ఎదురు నడిచి, ఆ చిన్నదాని మృదుపాణిని లాలనతో అందుకుని, తీసుకుని వచ్చాడు:

'రా, ఇలా కూర్చో' అని తనప్రక్కగా చూపించాడు జాగా. కాని, ఆ కుర్రది బిత్తరపడుతూ బెదురు చూపులతో, ఏమి బదులు చెప్పకుండా అలాగే నిలువబడి ఉన్నది.

'భయమా?'

అర్థం కానట్లు, తెలచూపు చూచింది, తాతగారివంక.

'సిగ్గా?'

'చిరునవ్వు దొంతరలు ఒరగదోసి కిలకిలలాడింది. ఆయనకూడా నవ్వుతూ,

'ఏదీ, మాటాడు చూదాం, ఏమాత్రం ముత్యాలు రాలుతాయో!'

'ఏమిటండీ మీరు, మరీని:'

'నీ పేరు ఏమిటమ్మా'

'నవమల్లిక'

'ఓహో – బలే సొగసైన పేరు. అరవిచ్చినా అందంగానే ఉంటుంది. అయితే నీవు పంకజం మనుమరాలివి కావూ?'

'అవునండీ!'

'చెప్పవేం – పోలికచూసి అనుకున్నా: నీ వయసులో మీ అమ్మమ్మ – నీలాగే...ఊహుఁ...ఇంకా కొంచెం బొద్దుగా ఉండేది. కాని, ఇంతకూ చెప్పావుకావు, మనుమణ్ణి సంపాదించావా, లేదా?

సిగ్గుతో తలవంచుకుంది; తాతగారు చేరదీసి, తల నొక్కులు చెదరకుండా నిమిరి, బుగ్గలు లఘువుగా ముద్దిడుకుని,

'ఎవరన్నా, బ్రాహ్మణ కుర్రవాణ్ణి...ఏం? మీకు మొదటినుంచీ మేమే అచ్చివచ్చాం... సైc!'

నవ్వింది.

'అc – ఇక వెళ్ళిరా – దేవాలయానికేనా?'

ఔనని తల ఊపింది.

ఆయన నవ్వుతూ...

'కామదేవోపాసన చేయాలిసిన వయసులో – నీకు నంది చెవులగుండా శివదర్శన మెందుకమ్మా'– రేపు ప్రొద్దున రా. కల్పం, పూజావిధానం చెపుతాను. ముందు లాభించేది చూచుకోవాలి కాని, మీ అమ్మమ్మలాగా అంత వయసువచ్చి రిటైరైన తరువాత, హరోం అనవచ్చునులే' అన్నాడు.

ఆ అమ్మాయి బిడియపడుతూ,

'వెళ్ళివస్తానండీ' అన్నది.

'మంచిది. శుభం, పోయిరా అమ్మ! – ఎన్నడైనా ఈ దోవ వచ్చినప్పుడు నా వైపుకూడా ఓ చూపు పారేస్తూ ఉండు: పరాయివాణ్ని కాదు' అని కన్నుగీటి చిరునవ్వుతో సెలవిచ్చాడు.

'అవధానీ! ఏం చేస్తున్నావు?' అని గుమ్మంవైపు తిరిగి పిలిచాడు, తాతగారు.

'లింగానుశాసనం చదువుతున్నానండీ' అని జవాబును ముందు నడిపించుకుంటూ ప్రత్యక్షమైనాడు ఛాత్రప్రవరుడు.

'ఎందాకా వచ్చావు: స్త్రీ విభాగం దాటావా?'

'లేదు!'

'కొంచెం తికమకలు పెడుతుందిలే – సరే కాని, ఇలారా!'

శిష్యుడు దగ్గరకు వచ్చాడు.

'చూడు, – ఆ ముందర వెళుతూన్నదే – ఆ ఊదా చీరె పిల్ల – గుళ్లోకి పోతూన్నది కాని, అందాకా వెళ్ళి 'అందరూ కులాసాగా ఉన్నారా?'– అని మా గురువుగారు కనుక్కురమ్మన్నారని, అడిగిరా!'

అవధాని తెల్లపోయి, తటపటాయించాడు.

'అరే! అలా, నిలబడతావేం! మనవాళ్ళే – నేను, అందాకా పోలేక, నిన్ను పంపడం: ఈ మాత్రం చేయలేని వాడవు – '

'వెళ్ళు' అని గదమాయించి పంపాడు: శిష్యుడు, సాగిపోయిన తరువాత, సావకాశంగా, చిరునవ్వుతో, నా వంక చూశాడు:

నేను నవ్వుకుంటూ, ఇవతలకు జరిగి,

'తాతయ్యా! బలేవాడవు: ఇంకా ఈ బుద్ధులేనా? – చింత చచ్చినా–'

'నీ యిల్లు బంగారంగానూ! చింత చావడమేమిటి, మళ్లా చిగురిస్తూంటే – అయినా మీ రందరూ ఇంతేలే, దమ్ములేని రకాలు! – ఎంతచెడ్డా, సానిపడుచు కులుకుతూ వీధివెంట నడుస్తూంటే, పలకరించకుండా పోనిచ్చే అంత వార్ధక్యం వచ్చిందా నాకు?'

'ఆ అమ్మాయి ఏమనుకుందో?'

'ఏమీ అనుకోదు: అంతగా రుచించకపోతే ఇంటికి వెళ్ళి బుగ్గలు సబ్బుతో మళ్లా ఓమారు తోముకుంటుంది–'

'చక్కనిదే!'

'ఆఁ – నీలోనూ రాసిక్యం ఘుమాయిస్తూందే – పిల్ల పేరూ బాగానే ఉంది: నవమల్లిక – అరవిరిసిన విరికన్నెల వయసు ముమ్మరం అర్ధరాత్రందాకా నని న్యాయం. ఏం – ఏమన్నా –'

'ఎబ్బే: లేదు, ఊరికేనే–'

'మొగమాట పడమోక: నీకు వరుస కూడాను ఏమంటావు?'

'అబ్బ! చంపకండి!'

'అవునులే! బుద్ధదేవుడి సహోధ్యాయివి. – ప్రాప్తి ఉండాలి నేనేం చేయనూ?'

'పోనీలెండి – మీ శిష్యుణ్ణే తయారు చేస్తూన్నారుగా?'

'అవును – మీరు సైన్సులో ప్రాక్టికల్ అని, ప్రత్యక్షంగా చేస్తారే – అలాగే, వీడిమానాన వీడు, అలంకారశాస్త్రం పూర్తిచేశాడు – కౌముది కావచ్చింది – కన్ను కొట్టడమైనా, కొత్త ఆడపిల్లను పలకరించడమైనా చేతగాక పోతే ఎందుకు పనికివస్తాడు – అనుభవంలేని చదువు ఎందుకూ, తాటాకులలోనే పడి ఉంటేనే నయం!'

'మీ చదువూ ఆ పంపిణీమీదేనా?'

'ఓ, మా సహపాఠులలో, గురువుని మించని శిష్యుడు లేడు –'

'మరి, శిష్యురాండ్రు–'

'వాళ్లా – ఇంక చెప్పాలా, చూపించకముందే అందుకు పోతారు: యామినీ పూర్ణతిలకం ఏం చేసింది?'

'సరేలెండి – మీతో వాదించలేను – మరి, వాడిని పంపారు – వట్టి అమాయకుడు: ఏం గలాభా జరుగుతుందో?'

'ఫరవాలేదు. ఏం జరిగినా, ఆ అనుభవం ముందుకు అక్కరకు వస్తుంది.'

'మరి, మీ శిష్యుడు ఇలా చేశాడని తెలిస్తే, మీకు–'

'నాకా? – నాకేం? – ఏదో కుర్రవాడు, ఇంకా దోవను పడక ఇలా చేశాడుకాని, అదే గురువైతేనా'– అని అనుకుంటారు, తెలిసినవాళ్ళు. ఐనా, ఎవరూ పలుకరించకుండా ఉంటే సానిపిల్లలు ఏమైపోవాలి చెప్పు?

–ఇక, అక్కడ నిలిచినా ప్రయోజనం లేదని, లోపలికి వెళ్ళిపోయినాను.

★ ★ ★